క్లుప్తంగా

సిమెంట్ కట్టడం కూల్చివేత



జేసీబీతో ప్రతాపరెడ్డి సిమెంట్ కట్టడాన్ని పగులగొడుతున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కౌలేపల్లి క్వాటర్స్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్‌రెడ్డి ఇంటి ముందు నిర్మించుకున్న సిమెంట్ కట్టడాన్ని మంగళవారం పంచాయతీ అధికారులు జేసీబీతో కూల్చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శైలజ మాట్లాడుతూ.. కట్టడం ఎత్తుగా నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తొలగించామన్నారు. అలాగే గ్రామంలో ఇలాంటి కట్టడాలు ఎక్కడ ఉన్నా పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. కాగా.. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఏజెంట్‌గా కూర్చున్నాననే అక్కసుతో టీడీపీ కార్యకర్తలు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కట్టడాన్ని తొలగించారని వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో టీడీపీ నాయకులు ఇళ్లముందు కూడా ఇలాంటి కట్టడాలు ఉన్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

20న జాబ్‌మేళా

కదిరి అర్బన్: స్థానిక ఎస్డీఎస్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 3 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. మరిన్ని వివరాలకు 9390176421 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



సాయి కుమార్

పుట్టపర్తి అర్బన్: ఈనెల 18 నుంచి 22 వరకు కేరళలోని తిరువనంతపురంలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ కేరళలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు ఎస్కే యూనివర్సిటీ తరఫున జగరాజుపల్లి మంగళకర కళాశాల విద్యార్థి సాయికుమార్ ఎంపికయ్యాడు. కళాశాలలో బీకాం రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సాయికుమార్‌ను మంగళవారం కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యా ప్రకాష్, ఏఓ జయచంద్రా రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు అధ్యాపక బృందం అభినందించింది. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి కళాశాల, యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కదిరి రూరల్ సీఐ నాగేంద్ర

తనకల్లు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి రూరల్ సీఐ నాగేంద్ర మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నియమాలను అందరూ పాటించాలని, సీటు బెల్టు, హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిప్పల వెంకప్ప

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న భగవాన్ రమణ మహర్షి 145వ జయంతి వేడుకలను మంగళవారం రమణ మహర్షి ట్రస్టు వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు మహా గణపతి పూజ, 9:30 గంటల నుంచి రమణ మహర్షికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 10 గంటలకు అరుణాచల అక్షర మణిమాల కార్యక్రమం, 11:45 గంటలకు అరుణాచల శివ నామసంకీర్తనలతో రమణ మహర్షి చిత్రపటంతో ప్రాకారోత్సవం చేపట్టారు. అన్నదానం అనంతరం నిరుపేదలకు దాతలు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మునెప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 2030 నాటికి సాధించాలన్నారు. పేదరికం లేని, ఆరోగ్యవంతమైన గ్రామాలు, సురక్షిత నీరు, పరిశుభ్రం-పచ్చదనం, స్వపరిపాలన, తదితర అంశాలతో కూడిన లక్ష్యాలను సాధించడానికి అన్ని శాఖల అధికారులు కలసికట్టుగా పని చేయాలన్నారు.

కాలకృత్యాలకు కష్టాలు

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కనిపించని మరుగుదొడ్లు
- పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్న ప్రజలు
- అత్యవసరమైతే తప్పని తిప్పలు



తలుపుల ఎంపీడీఓ కార్యాలయం

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ స్ఫూర్తి కనిపించడం లేదు. బహిరంగ మలమూత్ర విసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. అయితే అధికారుల్లో చలనం కనిపించడం లేదు. అధికారులు పని చేస్తున్న కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మించుకోవడంలో విఫలం అవుతున్నారు. అటు కేంద్రం స్వచ్ఛ భారత్, ఇటు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందడుగు వేస్తున్నా.. ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు ఇవేం పట్టడం లేదు. వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మండల కేంద్రానికి వస్తున్న ప్రజలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

వసతుల కొరత..

మండల కేంద్రం తలుపులలో తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయం, ఎంపీడీఓ, ఎంఆర్సీ, హౌసింగ్, పోలీస్‌స్టేషన్, తదితర కార్యాలయాలు పోలీస్‌స్టేషన్ మినహా, అన్నీ ఇంచు మించూ ఒక చోటే ఉన్నాయి. కాగా.. ప్రభుత్వ కార్యాలయాలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతన్నాయి. వివిధ పనుల నిమిత్తం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో రద్దీగా ఉంటాయి. ఈ కార్యాలయాల వద్ద పబ్లిక్ బాత్‌రూమ్స్, టాయిలెట్స్ లేవు. నిత్యం ప్రజలతో పాటు, కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది మలమూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పురుషులైతే బయట ఎక్కడికైనా వెళ్లి మూత్ర విసర్జన చేస్తారు. కార్యాలయాల వద్ద ఆరుబయట ఖాళీ స్థలాలు లేక పోవడంతో మహిళలు ఊపిరి బిగబట్టి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా సిబ్బంది నీరు తాగేందుకు కూడా భయపడుతున్నారు. తాగితే బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుందని తెలిసి.. ఇంటికి వెళ్లేంత వరకు అవసరం తీర్చుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా అవసరాల దృష్ట్యా అధికారులు స్పందించి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బస్టాండ్‌లో వృథాగా..

మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం గ్రామ పంచాయతీ వారు బస్‌షెల్టర్ స్థానంలో మరుగుదొడ్లను నిర్మించారు. ఉపయోగించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు వినియోగంలోకి తెసుకొచ్చి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

త్వరలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మిస్తాం



తరచూ కార్యాలయాల్లో తమ పనుల నిమిత్తం వచ్చే వారికి టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నారని, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో త్వరలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– రామానాయక్, ఎంపీడీఓ, తలుపుల మండలం

మినీ మహాసభ జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య

బత్తలపల్లి: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో త్వరలో ధర్మవరం పట్టణంలో నిర్వహించనున్న జర్నలిస్టుల మినీ మహాసభను జయప్రదం చేద్దామని ఏపీయూడబ్ల్యూజే శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని గుండా కళ్యాణ మండపంలో ధర్మవరం డివిజన్ ఏపీయూడబ్ల్యూజే సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ పాటుపడుతుందన్నారు. రూ.20 లక్షలతో జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ పత్రికల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశ స్థలాలు, అక్రిడేషన్లు, విద్యార్థులకు ఉచిత విద్య, విలేకరులపై దాడులు తదితర అనేక సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మినీ మహాసభ ఏర్పాట్లు, సభ విజయవంతానికి సబ్ కమిటీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్ ధర్మవరం డివిజన్ కార్యవర్గం గత నెల రోజులుగా చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, సీనియర్ జర్నలిస్టు ఉద్దండం చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్‌చౌదరి, జిల్లా నాయకులు జీవీ నారాయణ, రాము, పామాల నాగేంద్ర, ప్రసాద్, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ధర్మవరం డివిజన్ కమిటీలో సభ్యులైన బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం, ధర్మవరం రూరల్, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి



పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

చెన్నేకొత్తపల్లి: ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఉమ్మడి అనంతపురం జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో నమోదైన మలేరియా కేసులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై కేసులు నమోదు కాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం సబ్ యూనిట్ అధికారి జయరాం నాయక్, సీహెచ్ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతితో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పతకాలు సాధించిన విద్యార్థులతో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రామ్

నల్లమాడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీసత్యసాయి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కే.మోహన్ రామ్ సూచించారు. ఐదో రాష్ట్రస్థాయి జూనియర్ జంప్ రోప్‌లో తొమ్మిది బంగారు పతకాలు, ఓ కాంస్య పతకం సాధించిన స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను మంగళవారం అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కే.మోహన్‌రామ్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో కూడా క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి జాతీయ జంప్ రోప్ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సురేష్ బాబు, హెచ్ఎం సతీష్, వసతిగృహ సంక్షేమ అధికారి సత్యనారాయణ, పీడీ ధరణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి



ఏకపాదంపల్లిలో సూచనలిస్తున్న ఏఓ రమాదేవి

తాడిమర్రి: వేరుశనగ పంటలో తెగుళ్లను నివారించుకుంటేనే అధిక దిగుబడి సాధ్యమని ఏఓ రమాదేవి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పొలాలను సందర్శించి పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే వైరస్ వ్యాప్తి చెంది మొక్క ఎదుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ పురుగు మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీంతో నెల రోజుల వరకు పురుగు పంటను ఆశించకుండా చేయవచ్చని సూచించారు. అనంతరం ఆమె రైతులకు రబీ పంటల బీమాపై వివరించారు. ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలు లబ్ధి పొందాలంటే రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎస్ఏ నాగేంద్ర, ఎంపీఈఓ విజయ్ పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల సాధనతో ఉత్తమ మార్కులు



పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ రూపొందిస్తున్న ఎస్ఎస్సీ మోడల్ పేపర్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఎంఈఓలు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్సీ మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పాటుపడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని ఏటా మోడల్ పేపర్లను అందజేయడం హర్షణీయమని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఈ మోడల్ పేపర్ నుంచి ప్రతి ఏడాది 70 నుంచి 80 మార్కుల ప్రశ్నలు వస్తున్నాయని తెలిపారు. ఈ మోడల్ పేపర్లు గ్రామీణ విద్యార్థుల శ్రేయస్సుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మేరి వరకుమారి మాట్లాడుతూ.. గత సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లలోని ప్రశ్నలు 80 శాతం పైగా వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎంతో చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయ్యారన్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఈ మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగపడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయిగణేష్, సీనియర్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, లతాదేవి, నాగేంద్రమ్మ, వీరనారాయణమ్మ, విజయలక్ష్మి, రామంజనేయులు, మొహిద్దీన్ పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయండి సారూ..



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్ర నాయక్

ఎన్పీకుంట: సామాజిక పింఛన్లు మంజూరు చేయాలంటూ పలువురు వృద్ధులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్ర నాయక్‌కు వినతిపత్రాలు సమర్పించారు. మంగళవారం పెడబల్లి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రెవెన్యూ సమస్యలకు సంబంధించి 11, పింఛన్ల మంజూరు కొరకు 9 మొత్తం 20 అర్జీలు వచ్చాయి. అలాగే దరఖాస్తు చేసుకున్న పలువురికి ఫ్రీ సర్వీస్ కింద 1బీలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్ర నాయక్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. 20వ తేదీన ఎదురుదోన గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహిచడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీలను రెవెన్యూ అధికారులకు అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీహరి శర్మ, ఆర్ఐ శ్రీధర్, మండల సర్వేయర్ జిలానీ, వీఆర్ఓ రఘు, గ్రామ సర్వేయర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

2025 క్యాలెండర్ ఆవిష్కరణ



వైఎస్సార్‌సీపీ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యువత

అమడగూరు: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు అమడగూరు బస్టాండ్‌లో పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి 2025 ఏడాదికి సంబంధించిన వైఎస్సార్‌సీపీ క్యాలెండర్లను మంగళవారం విడుదల చేశారు. మండల వ్యాప్తంగా ప్రతి ఇంటికి క్యాలెండర్‌ను చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. క్యాలెండర్‌లో పంచాంగాన్ని పొందుపర్చి చూపరులను ఆకట్టుకునేలా సిద్ధం చేశారు.

కోనేరు పరిశీలన

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి కోనేరు (భృగుతీర్థాన్ని) ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు రెండు నెలల సమయం మాత్రమే ఉందన్నారు. పవిత్రమైన కోనేరులో భక్తులు స్నానం చేయడానికి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. తిరువీధులు, మంటపాలు, తేరును పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ తయారు చేసి భవిష్యత్‌లోనూ దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో పాటు సాంకేతిక వాస్తు నిపుణులు (స్థపతి) పరమేశ్వరయ్య, డీఈ శ్రీనివాస ప్రసాద్, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, అర్చకులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సేవలు అభినందనీయం



ధర్మవరం అర్బన్: విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన సంఘం సభ్యులు



కదిరి టౌన్: 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలో పెన్షనర్ల సంక్షేమ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. మంగళవారం కదిరి పెన్షనర్ల సంక్షేమ సంఘం 5వ వార్షికోత్సవం సంఘం అధ్యక్షుడు బి.వి.శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. శ్మశానవాటిక, వృద్ధాప్యంలో కేర్ టేకింగ్ హోమ్ కావాలని పలువురు పెన్షనర్లు ఎమ్మెల్యేను కోరారు. శ్మశానవాటిక ఎకరా స్థలం కేటాయించాలని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మకు సూచించారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన 30 మంది పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ ఆఫీసర్ కె.ఆర్.నాగమల్లిక, స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, రిటైర్డ్ డిప్యూటీ ఆడిటర్ రమణారెడ్డి, సంఘం కార్యదర్శి పి.అత్మారెడ్డి, ట్రెజరర్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: కొత్తచెరువులోని పెన్షనర్ల భవనంలో మంగళవారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు రామక్రిష్ణయ్య ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులై ఉండి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన అబ్దుల్, రెహమాన్, చెన్నక్రిష్టారెడ్డిని సత్కరించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎన్జీఓ హోంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు పోతిరెడ్డి, గోవిందరెడ్డి, సరోజిని, సదాశివరెడ్డి, కంబగిరి, శివయ్య, నాగరాజు, శ్రీనివాసులు, యజ్ఞన్న, రామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చలపతి, ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఏటీఓ పద్మనాభం, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సందీప్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర నారాయణ, ఐసీఐసీఐ మేనేజర్ నిగోల్, కొత్తపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సువర్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి నర్సిరెడ్డి, మానవతా స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు చెన్నప్ప, కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు: ఒకరికి గాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రాఘవంపల్లి బస్‌స్టాప్ సమీపంలో మంగళవారం ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని రాఘవంపల్లి నుంచి బత్తలపల్లికి ఆటో వస్తోంది. ఇదే సమయంలో అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అశ్వ వాహనంపై అయ్యప్ప వైభవం



పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఓడీచెరువు: మండల కేంద్రానికి సమీపంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వ వాహనంపై అయ్యప్ప స్వామి ఊరేగింపు జరిగింది. పురవీధుల్లో మణికంఠుడి ప్రత్యేక రథయాత్ర ఆకట్టుకుంది. అంతకు ముందు ఆలయంలో అయ్యప్ప మాలధారులకు ట్రాన్స్‌కో లైన్‌మెన్ రామంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నల్లచెరువు/తాడిమర్రి/బత్తలపల్లి/ఓడీచెరువు: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నల్లచెరువు ఎంపీపీ రమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎం అగ్రహారం సచివాలయంలో స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తాడిమర్రి మండలంలోని రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కార చర్యలు చేపడుతామన్నారు. సెల్ టవర్ కావాలని ఒకటి, పింఛన్ కోసం ఒకటి, వెబ్‌ల్యాండ్ నమోదుకు ఒకటి మొత్తం మూడు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. బత్తలపల్లి మండలం గరిశలపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ స్వర్ణలత మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, సర్పంచు మాదిరెడ్డి పద్మావతి, దేవదాయశాఖ అధికారిణి నాగరత్నమ్మ, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వీఆర్ఓ నరసింహులు, నాగేంద్ర ప్రసాద్, గ్రామ సర్వేయర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఇక ఓడీచెరువు మండలం సున్నంపల్లి సచివాలయ భవనంలో రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ సమస్యలపై 11 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 7 అర్జీలు..

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 7 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలకు 3, అడంగల్ సరి చేయాలంటూ 4 వినతిపత్రాలు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జాఫర్, వీఆర్వో చంద్రశేఖర రెడ్డి, సర్వేయర్ జగన్నాథ రెడ్డి పాల్గొన్నారు.

కనగానపల్లి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని తగరకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సుకు విచ్చేసిన గ్రామస్తులు వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. ఆర్ఐ సరళ, వీఆర్వో మారుతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.